

సాక్షి
గుంటూరు

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు గురువారం 2423 క్యూసెక్కులు విడుదల చేశారు. వీటిలో అత్యధికంగా కొమ్మమూరు కాల్వకు కేటాయించారు.



పులిచింతలలో 42 టీఎంసీలు

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.0787 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 29607 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 2200 వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా గురువారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

సివిల్ ఇంజినీరింగ్ నిరుద్యోగులకు శిక్షణ


నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన నిరుద్యోగ యువతకు కోటప్పకొండ స్కిల్ కళాశాలలో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్టు డీఆర్‌డీఏ పథక సంచాలకుడు వై.హరిహరనాథ్ గురువారం తెలిపారు. శిబిరంలో నాలుగు నెలల పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించి తగిన శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణకు హాజరైన నిరుద్యోగ యువతకు శిక్షణానంతరం ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగ కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ యువత తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, కుల ధృవీకరణ, బ్యాంక్ ఖాతా పుస్తకం నకలుతో కోటప్పకొండ స్కిల్ కళాశాలలో వెంటనే సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 9346890335 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

యార్డుకు 1,20,859 బస్తాల మిర్చి



కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,20,859 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,16,426 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 81,301 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 560.60 అడుగుల వద్ద ఉంది. ఇది 233.8358 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 10,350, ఎడమకాలువకు 8,629, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 20,311, ఎస్‌ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 42,010 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీటి చేరిక పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 836.30 అడుగుల వద్ద ఉంది. ఇది 56.6894 టీఎంసీలకు సమానం.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

బాపట్ల: ప్రభుత్వం ఈనెల 17న నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళా పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చీరాల మున్సిపల్ హైస్కూలులో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో 18 నుంచి 48 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులుఉపయోగించుకోవచ్చని తెలిపారు. బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు పాస్‌పోర్టు ఫోటో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 8555901198, 9346280289ను సంప్రదించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి కె.రఘు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్, ఉపాధి కల్పన జూనియర్ ఎంప్లామెంట్ అధికారి రమాదేవి వివిధ కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

స్టాంపు విక్రేతలపై విచారణ

గుంటూరు వెస్ట్: నాన్ జ్యూడీషియల్ స్టాంపు పేపర్లు అధిక ధరలకు అమ్ముతున్న నేపథ్యంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, విజిలెన్స్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గుంటూరు జిల్లా అధికారులు కూడా వారం క్రితం ఒక ప్రత్యేక బృందాన్ని నియమించారు. వీరు జిల్లాలో స్టాంపు వెండార్లపై తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో పంది మంది స్టాంపు వెండార్లు రూ.10, 20, 50 నాన్ జ్యూడీషియల్ స్టాంపులకు రూ.10, రూ, 100 స్టాంపు పేపర్‌కు రూ.10 నుంచి రూ.20 అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆధారాలతో సహా గుర్తించారు. ఈ క్రమంలో వీరిపై క్రమశిక్షణా చర్యలకు అధికారులు సిద్ధమవుతున్నారు.

లాభాల 'బిందు' సేద్యం

- సాగు సాఫీకి డ్రిప్, స్ప్రింక్లర్లతో ప్రోత్సాహం
- లక్ష్యానికి మించి నమోదైన రిజిస్ట్రేషన్లు
- జిల్లాలో డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు ఇచ్చిన లక్ష్యం: 500 హెక్టార్లు
- ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్: 772 హెక్టార్లు
- పరిపాలనా పరమైన అనుమతులు : 552 హెక్టార్లు
- పరికరాలను అందించిన పొలాలు: 450 హెక్టార్లు



కొల్లిపర గ్రామంలో బోరుకు ఏర్పాటు చేసిన డ్రిప్‌ను పరిశీలిస్తున్న అధికారులు



పెనుమాక గ్రామంలో కూరగాయల సాగుకు ఏర్పాటు చేసిన డ్రిప్

కొరిటిపాడు (గుంటూరు): ప్రతినీటి బొట్టును ఒడిసి పట్టేలా ప్రభుత్వం బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం సన్న, చిన్నకారు రైతులకు రాయితీలు అందిస్తోంది. ఆసక్తి గల రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటూ కల్పించింది. ప్రస్తుతం ఈ ప్రక్రియ గుంటూరు జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. మార్చి చివరి నాటికి లక్ష్యం పూర్తి చేసేలా ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) అధికారులు కృషి చేస్తున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుతో నీటి వృథాను అరికట్టడంతోపాటు విద్యుత్‌ను పొదుపు చేయవచ్చు. మొక్కకు సరిపడా నీరు అంది పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుంది.

రిజిస్ట్రేషన్లు ముమ్మరం

డ్రిప్పు, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి గుంటూరు జిల్లాలో 500 హెక్టార్లకు మంజూరు చేయాలనేది ఏపీఎంఐపీ లక్ష్యం. ఇందుకోసం ఫిబ్రవరి 6వ తేదీ నాటికి 772 మంది రైతులు 639 హెక్టార్లలో సూక్ష్మ పరికరాల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ లక్ష్యాన్ని మార్చి చివరి నాటికి పూర్తి చేసేలా ఏపీఎంఐపీ అధికారులు కృషి చేస్తున్నారు. జిల్లాలోని కొల్లిపర, మంగళగిరి, తాడేపల్లి, వట్టిచెరుకూరు, ఫిరంగిపురం, కాకుమాను, ప్రత్తిపాడు, పెదనందిపాడు, తుళ్ళూరు, మేడికొండూరు తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో 625 మంది రైతులకు 552 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను మంజూరు చేశారు. ఇందులో ఇప్పటి వరకు 610 మంది రైతులకు 450 హెక్టార్లకు సంబంధించి పరికరాలను అందజేశారు. వాటి ఏర్పాటులో రైతులు, కంపెనీ ప్రతినిధులు బిజీగా ఉన్నారు. గుంటూరు జిల్లాకు సంబంధించి డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు 2022–23 సంవత్సరానికి 18 మండలాలల పరిధిలో 500 హెక్టార్లను టార్గెట్‌గా ఇచ్చారు. ఇప్పటి వరకు 639 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

రాయితీ ఇలా...

బిందు, తుంపర సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకునే రైతులకు భూ విస్తీర్ణం మేరకు రాయితీ లభిస్తుంది. డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకొన్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ ఉంటుంది. అదే విధంగా స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకొన్న చిన్న, సన్నకారు రైతులకు 55 శాతం సబ్సిడీతో పరికరాలను అందిస్తారు. సబ్సిడీ పోగా మిగిలిన సొమ్మును రైతులు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో డ్రిప్ ఏర్పాటు చేసుకుని ఏడేళ్లు ముగిసిన రైతులు కూడా డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను పంపిణీ చేసే ఐదు కంపెనీల్లో రైతులు దేన్నయినా ఎంపిక చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

క్షేత్రస్థాయిలో పరిశీలన...

డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ఎంత భూమి ఉంది. బోరు సౌకర్యం ఉందా.. ఉంటే అందులో ఎంత నీరు వస్తుంది.. రైతు పొలంలో ఎన్ని చెట్లు ఉన్నాయి.. పైపుల ఏర్పాటుకు ఎంత ఖర్చు వస్తుంది.. ఇందులో రైతుకు ఎంత సబ్సిడీ వర్తిస్తుందనే విషయాలను రైతు భరోసా కేంద్రాల ఉద్యాన, వ్యవసాయ శాఖల అసిస్టెంట్స్ (వీహెచ్‌ఏ, వీఏఏలు), కంపెనీ ప్రతినిధులు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఇప్పటి వరకు 625 మంది రైతులకు సంబంధించి 552 హెక్టార్లకు అడ్మినిస్ట్రేటివ్ శ్యాంక్షన్ చేయగా ఇందులో 610 మందికి 450 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలను అందించారు.

అర్హులందరికీ పరికరాలు అందిస్తాం



డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి మార్చి చివరి నాటికి లక్ష్యానికి మించి అదనంగా అందించడానికి కృషి చేస్తున్నాం. రైతులు తమ తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆర్‌బీకే ఇన్‌చార్జులు, కంపెనీ ప్రతినిధుల ద్వారా ప్రాథమిక సర్వే చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న అర్హులైన ప్రతి రైతుకు డ్రిప్, స్ప్రింక్లర్లను మంజూరు చేస్తాం. వీటికి వాటికి ఉద్యాన, వ్యవసాయ శాఖల అసిస్టెంట్ల ద్వారా పరికరాలను అందిస్తాం.

–ఎల్.వజ్రశ్రీ, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్, గుంటూరు జిల్లా

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 2.33 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వరస్వామి వార్లకు భక్తులు హుండీల ద్వారా రూ.2.33 కోట్ల నగదు కానుకలు, మొక్కుబడులుగా సమర్పించారు. మహామండపం ఆరో అంతస్తులో గురువారం హుండీలు లెక్కించారు. 15 రోజులకు గాను 41 హుండీల ద్వారా రూ.2,33,26,526 నగదు ఆదాయంగా లభించిందని ఈవో భ్రమరాంబ తెలిపారు. నగదుతో పాటు 728 గ్రాముల బంగారం, 5.210 కిలోల వెండి వచ్చిందని చెప్పారు. రోజుకు సరాసరిగా రూ. 15.54 లక్షల ఆదాయం హుండీల ద్వారా లభించిందని పేర్కొన్నారు. కానుకల లెక్కింపును చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బుద్దా రాంబాబు, కేసరి నాగమణి, దేవిశెట్టి బాలకృష్ణ, బచ్చు మాధవీలత, నిడమానూరి కళ్యాణి, నంబూరి రవి, చింతా శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు. ఈహుండీ ద్వారా రూ. 31,056 కానుకలు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు దేవస్థానానికి ఆన్‌లైన్‌లో చెల్లించారు. దుర్గగుడి నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కర్నాటి రాంబాబును విజయవాడ వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు విశ్వనాథ రవి, పలువురు ఆటో యూనియన్ నేతలు కలిసి శాలువాతో సత్కరించారు. పాలక మండలి సభ్యులను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టులు పునర్వ్యవస్థీకరణ

నెహ్రూనగర్ (గుంటూరు తూర్పు): ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసీడీఎస్) ప్రాజెక్టులు రీఆర్గనైజ్ (పునర్వ్యవస్థీకరణ) కానున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కోసం, నియోజకవర్గ పరిధిలో, మండల పరిధిలో పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులను రీ ఆర్గనైజ్ చేయనుంది. ఇందుకు సంబంధించి జీఓ నం.2 ను ప్రభుత్వం గురువారం జారీ చేసింది.

గతంలో ఒక ప్రాజెక్టు రెండు నియోజకవర్గాల్లో లేదా రెండు మూడు మండలాల్లో కలిపి ఉండేది. దీనివలన పర్యవేక్షణతో పాటు పరిపాలనకు సంబంధించి పలు అడ్డంకులు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 23 ప్రాజెక్టులు ఉండగా కొత్త జిల్లాలు ఏర్పడిన తరువాత 10 ప్రాజెక్టులకు పరిమితమైంది. ప్రస్తుతం ప్రాజెక్టుల రీ ఆర్గనైజ్ చేయాలని ప్రభుత్వం జీఓ జారీ చేయడంతో గుంటూరు జిల్లాలో 17 మండలాలు, ఐదు మున్సిపాలిటీలు కలిపి ఆరు ప్రాజెక్టులకు కుదించారు. త్వరలో ప్రాజెక్టులు రీ ఆర్గనైజేషన్ కానున్నట్లు పీడీ బి.మనోరంజని తెలిపారు.

గుంటూరు జిల్లా ప్రాజెక్టు పరిధి వివరాలు

ప్రాజెక్ట్ హెడ్ క్వార్టర్	మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు	మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	మండలాలు / మున్సిపాలిటీ
ఫిరంగిపురం	250	4	తాడికొండ, తుళ్లూరు, ఫిరంగిపురం, మేడికొండూరు
గుంటూరు అర్బన్	321	0	గుంటూరు మండలం
ప్రత్తిపాడు	223	3	గుంటూరురూరల్, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను
మంగళగిరి	235	3	మంగళగిరి మున్సిపాలిటీ, మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటి, తాడేపల్లి దుగ్గిరాల
తెనాలి	193	7	తెనాలి, తెనాలి మండలం, కొల్లిపర
పొన్నూరు	241	0	పొన్నూరు, పొన్నూరు మండలం, చేబ్రోలు, పెదకాకాని
మొత్తం	1463	17	

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.3,500, గరిష్ఠ ధర రూ.5,000, మోడల్ ధర రూ.4,200 వరకు పలికింది.

సమాజానికి మార్గం చూపేవి పుస్తకాలే

- గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్
- ఘనంగా పుస్తక మహోత్సవం ప్రారంభం
- తరలివచ్చిన సాహితీవేత్తలు




మధురాంతకం రాజారాం పుస్తకం ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్ అహ్మద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, రామచంద్రమూర్తి, విజయ్‌కుమార్, నరేంద్ర

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజానికి మార్గం చూపేవి పుస్తకాలేనని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. నూతన ఆలోచనలతో కూడిన ప్రపంచంలోకి మనిషిని తీసుకెళ్లే గొప్ప సాధనం పుస్తకమేనని తెలిపారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 33వ విజయవాడ పుస్తక మహోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదివేకొద్దీ జ్ఞానవంతులవుతారని చెప్పారు. మానసిక ఒత్తిడిని నివారించేందుకు పుస్తకాలు దోహదం చేస్తాయన్నారు.

విద్యా రంగంలో గొప్ప సంస్కరణలు...

విద్యా రంగంలో గొప్ప సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. అన్ని ప్రాంతాలకు చెందిన ప్రచురణకర్తలు తరలిరావటం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా గ్రంథాలయాల పటిష్టతకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎన్ని మాధ్యమాలు వచ్చినా పుస్తకానికి ఆదరణ తగ్గలేదని తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు అన్నారు. తొలుత విశ్రాంత అధ్యాపకుడు వి.సుందరరావు స్వాతంత్ర్య సంగ్రామ యోధుల చరిత్రను తెలియజేసే విధంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను గవర్నర్ తిలకించారు.



స్టాల్స్‌లో పుస్తకాలు పరిశీలిస్తున్న యువతులు

గొల్లపూడి బహుముఖ ప్రజ్ఞాశాలి

ప్రముఖ సాహితీవేత్త, సినీ, రంగస్థల నటుడు గొల్లపూడి మారుతీరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రముఖ సంపాదకులు కె. రామచంద్రమూర్తి అన్నారు. గొల్లపూడి సంస్మరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాహితీవేత్తగా, నాటక రచయితగా, నటుడిగా అద్భుతమైన సేవలందించారని కొనియాడారు. అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నరేంద్ర మాట్లాడారు. ఇంతియాజ్ అహ్మద్, రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మనోహరనాయుడు, లక్ష్మయ్య ప్రసంగించారు. ఎమెస్కో ప్రచురించిన రాజారామ్ 300 కథల సంపుటిని ఆయన తనయుడు మధురాంతకం నరేంద్ర ఆవిష్కరించారు.

హాయ్.. సెల్‌ఫోన్ చేతికొచ్చె..

- 2020లో మిస్సింగ్!
- పోలీసు వాట్సాప్ దృష్టికి బాధితులు
- మరో మూడు మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత
- కొనసాగుతున్న ఫిర్యాదుల పరంపర



బాధితులకు మొబైల్‌ఫోన్లను అప్పగించిన ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన సీఐ నరసింహ

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ఏళ్ల తరబడి క్రితం మొబైల్‌ఫోన్లను పోగొట్టుకుని.. ఇక వాటి ఆచూకీ లభించదని రోజు వారీ పనుల్లో నిమగ్నమయ్యే మొబైల్‌దారులు కొత్తవి కొనుగోలు చేసుకుని వాడుతుంటారు. అయితే పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను తీసుకువచ్చి బాధితులకు అప్పగిస్తే.. ఆ ఆనందం మాటల్లో చెప్పలేం.. అటువంటి సంతోషాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నారు గుంటూరు జిల్లా పోలీసులు..

వివరాల్లోకి వెళ్తే..


పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నివసించే వెంకటనారాయణ స్థానికంగా చిల్లర దుకాణం నిర్వర్తించే వారు. 2020లో కిరాణా సరుకుల నిమిత్తం గుంటూరు నగరానికి వచ్చారు. ఈ క్రమంలో అతని మొబైల్ ఫోన్ (రెడ్‌మీ–08) పోయింది. పోగొట్టుకున్న ఫోన్ దొరకదనే ఆలోచనతో మిన్నకుండిపోయాడు. దీంతో కొత్త మొబైల్‌ఫోన్ కొనుగోలు చేసి వాడుతున్నాడు.

అయితే గతనెల 28న గుంటూరు జిల్లా పోలీసులు మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల సౌకర్యార్థం వాట్సాప్ నంబర్ 86888 31574ను అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం విదితమే. ఈ క్రమంలో వాట్సాప్ నంబర్‌కు బాధితుడు 'హాయ్' అని మేసేజ్ పంపించాడు. దీంతో లింక్‌తో కూడిన ఓ మేసేజ్ అతనికి రావడంతో లింక్ ఓపెన్ చేసి వివరాలు తెలిపి, అప్లికేషన్ సబ్మిట్ చేశాడు. అనంతరం మొబైల్ ఫోన్ ట్రాక్ చేసి గుర్తించారు. అతనితోపాటు మరో రెండు మొబైల్‌ఫోన్లను గుర్తించారు. దీంతో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వెంకట నారాయణ, గుంటూరు నగరంలో ఉంటున్న లీలా మాధూరి (వన్ ప్లస్), నల్లూరు వెంకటేశ్వరరావు (వీవో వీ–20)ల ఫోన్లను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు 86888 31574 వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని మేసేజ్ చేయాలన్నారు.

ఈనెల ఆరో తేదీన అయిదు మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. తాము పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు ఇక దొరకవనే ఆలోచనతో కొత్త సెల్‌ఫోన్లు కొనుగోలు చేసి వాడుకుంటున్నామనీ, ఈ క్రమంలో పాత మొబైల్‌ఫోన్లను తిరిగి అప్పగించడంతో ఆనందంగా ఉందని బాధితులు వెల్లడించారు. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు, ఐటీ కోర్ ఇన్‌చార్జ్ ఎస్ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

దశాబ్దాల కల సాకారం!

- కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వ ఆమోదం
- రూ.60 కోట్ల నిధులు మంజూరు
- ఎన్టీఆర్, పల్నాడు జిల్లా వాసులకు తీరనున్న కష్టాలు
- బ్రిడ్జితో తగ్గనున్న ప్రయాణభారం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ముక్త్యాల–మాదిపాడు మధ్య కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టే ప్రాంతం

జగ్గయ్యపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో రెండు జిల్లాల ప్రజల కల త్వరలోనే సాకారం కానుంది. ఎన్నో దశాబ్దాలుగా జనం చూస్తున్న ఎదురుచూపులు ఫలించనున్నాయి. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం ముక్త్యాల గ్రామం నుంచి పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం మాదిపాడు వరకు కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.60 కోట్ల వ్యయంతో 2.3 కిలో మీటర్ల మేర బ్రిడ్జి నిర్మాణం చేపట్టబోతున్నారు. దీని వల్ల రెండు జిల్లాల ప్రజలకు బహుళ ప్రయోజనాలు కలగనున్నాయి.

ప్రస్తుత పరిస్థితి ఇదీ

ప్రస్తుతం రెండు జిల్లాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే నాటు పడవలు, బల్లకట్టు మార్గమే శరణ్యం. నదిలో అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సిందే. రైతులు, వ్యాపారులు, ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ చేసుకునేందుకు రవాణా సదుపాయమైన బ్రిడ్జి లేకపోవటంతో చాలా అసౌకర్యానికి గురవుతున్నారు. గత ప్రభుత్వాలు ఈ సమస్య పరిష్కారానికి ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలను గుర్తించి కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం తెలిపింది.

అప్రోచ్ రోడ్డుకు స్థలం కేటాయింపు...

బ్రిడ్జి నిర్మాణానికి గ్రామంలోని కోటి లింగాల నుంచి నది ఒడ్డున గల మాదిపాడు వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఆయా శాఖల అధికారులు స్థలాన్ని కేటాయించి ప్రతిపాదన కూడా పంపించారు. ప్రస్తుతం గ్రామ సమీపంలోని 15 కిలోమీటర్ల పరిధిలో గల పులిచింతల నుంచి రెండు జిల్లాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే రాకపోకలు కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే డ్యామ్‌పై అనుమతిస్తారు. ప్రస్తుతం నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే నిత్యం రాకపోకలు సాగించవచ్చు.

పారిశ్రామిక రంగానికి బహుళ ప్రయోజనం..

జిల్లాలోనే తెలంగాణ సరిహద్దు ఉన్న ఈ గ్రామం బ్రిడ్జి నిర్మాణం జరిగితే రూపురేఖలు పూర్తిగా మారుతాయి. పల్నాడు వాసులు హైదరాబాద్ వెళ్లాలంటే 75 కిలోమీటర్ల మేర దూరం తగ్గటంతో పాటు విజయవాడ నగరంలో ట్రాఫిక్ తగ్గే అవకాశం ఉంది. పడవ, బల్లకట్టు ప్రమాదాలు పూర్తిగా తగ్గిపోతాయి. పారిశ్రామిక రంగం కూడా బాగా అభివృద్ధి చెందుతుంది.

గుణదల మేరీమాత ఉత్సవాలు ఆరంభం

గుణదల(విజయవాడ తూర్పు): గుణదల పుణ్యక్షేత్రంలో మేరీమాత ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, గోల్డెన్ జుబిలేరియన్ గురువు ఫాదర్ పుతెన్ పుర, పుణ్య క్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. బిషప్ గ్రాసి పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై సమిష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు వాక్య సందేశం అందించారు. ఈ సందర్భంగా రజిత జుబిలేరియన్ గురువు పసల థామస్ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో అతి పెద్ద రెండవ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న గుణదల మేరీమాత ఆలయం నూరు వసంతాలకు చేరువకానుందని తెలిపారు. ప్రస్తుతం 99వ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మరియతల్లి మహిమ కారణంగానే ఇన్నేళ్లుగా గుణదల ఆధ్యాత్మికంగా వెలుగొందుతుందని వెల్లడించారు. మరియమాతను ఆశ్రయించిన వారికి దీవెనలు లభిస్తాయని వివరించారు. విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తారని తెలిపారు.

టీడీఎస్‌ను నిర్ణీత గడువులోగా చెల్లించాలి

నరసరావుపేట: ఉద్యోగుల నుంచి ప్రతి నెలా వసూలు చేసే టీడీఎస్ (టాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్) నిర్ణీత గడువులోగా కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాలని ఆదాయపు పన్నుశాఖ డెప్యూటీ కమిషనర్ ప్రేమ్‌కుమార్, ఆదాయపు పన్ను అధికారి ఎస్ జగదీష్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల డీడీవోలకు టీడీఎస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా టీడీఎస్ చెల్లింపు విధానం, ప్రభుత్వ నిబంధనలు, సెక్షన్లు గురించి వివరించారు. కలెక్టరేట్ ఏవో అనీల్‌కుమార్, డీఆర్వో వినాయకం పాల్గొన్నారు.

కోటప్పకొండ తిరునాళ్లకు 535 బస్సులు

- నెల్లూరు జోన్ ఈడీ షేక్ ఆదంసాహెబ్
- చార్జీల పెంపు ఆలోచన లేదు
- ఏర్పాట్లపై సమీక్ష


అధికారులతో తిరునాళ్లపై సమీక్ష చేస్తున్న ఈడీ షేక్ ఆదంసాహెబ్

నరసరావుపేట: నరసరావుపేట మండలం కోటప్పకొండలో మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈనెల 18వ తేదీన నిర్వహించే మహా తిరునాళ్లకు రాష్ట్రంలోని పలు ప్రదేశాల నుంచి 535 బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ ఆదంసాహెబ్ వెల్లడించారు. గురువారం తిరునాళ్ల ఏర్పాట్లపై స్థానిక డిపోలో అధికారులతో సమీక్ష చేశారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అద్దంకి, చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, ఒంగోలుతో పాటు అన్నీ ముఖ్యమైన ప్రదేశాల నుంచి జాతరకు బస్సులు నడుపుతున్నామన్నారు. ఐదేళ్ల నుంచి ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్న చార్జీలనే ఈ ఏడాది కూడా అమలు చేస్తున్నామన్నారు. నరసరావుపేట నుంచి కొండకు 185, చిలకలూరిపేట నుంచి 120 బస్సులు, వినుకొండ నుంచి 35, అద్దంకి నుంచి 25, చీరాల, ఒంగోలు నుంచి 45 బస్సులు చొప్పున నడుపుతున్నామన్నారు. ఘాట్‌లో తిప్పేందుకు తిరుమల నుంచి సప్తగిరి బస్సులను ప్రత్యేకంగా తెప్పిస్తున్నామన్నారు. వీఐపీల కోసం 20బస్సులు తిరుగుతాయన్నారు. మొత్తం ఆరు క్యాంపు పాయింట్లు ఏర్పాటు చేశామని, కొండ దిగువన మూడు, కొండపైన ఒకటి, నరసరావుపేట, పురుషోత్తమ పట్టణం వద్ద ఒకటి చొప్పున ఏర్పాటుచేశామన్నారు. ప్రతి క్యాంపునకు ఇద్దరు సీనియర్, ఇద్దరు జూనియర్ అధికారులు, 30మంది బుకింగ్ ఆపరేటర్లు ఉంటారన్నారు. కొండపైన జింకల పార్కు వద్ద బుకింగ్ పాయింట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కండక్టర్లు, డ్రైవర్లు కాకుండా మొత్తం 1500మంది ఉద్యోగులు తిరునాళ్ల కోసం పనిచేస్తారన్నారు. సమావేశంలో ప్రజా రవాణా జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఈడీ ఆఫీసు డీఎం శ్రీనివాసరెడ్డి, స్థానిక డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి పాల్గొన్నారు.

కోటప్పకొండకు చార్జీలు ఇలా...

నరసరావుపేట నుంచి	రూ.30
చిలకలూరిపేట నుంచి	రూ.30
వినుకొండ నుంచి	రూ.60
ఒంగోలు నుంచి	రూ.120
అద్దంకి నుంచి	రూ.105
చీరాల నుంచి	రూ.120
కొండ దిగువ భాగం నుంచి ఘాట్ ద్వారా పైకి వెళ్లేందుకు	రూ.25

కార్మికులను వేధిస్తే చర్యలు


ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌కుమార్

లక్ష్మీపురం: వెట్టి చాకిరి చేయించి సంబంధిత కార్మికులను వేధింపులకు గురిచేసే వార్మిపై వెట్టి చాకిరి నిర్మూలన చట్టం ద్వారా చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఎస్.శ్రీనివాస కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని గుంటూరు జోన్ కార్మిక శాఖ కార్యాలయంలో గురువారం వెట్టి చాకిరి నిర్మూలన చట్టంపై పోస్టర్‌ను ఆ శాఖ సంయుక్త కమిషనర్ ఎస్.శ్రీనివాసకుమార్, సంబంధిత అధికారులు ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల చేత వెట్టి చాకిరి చేయించుకుని వారికి సకాలంలో రావాల్సిన మొత్తాన్ని చెల్లించకపోగా అధిక భారం వేస్తూ వేధింపులకు దిగుతున్న యాజమాన్యాలకు వెట్టి చాకిరి నిర్మూలన చట్టం పూర్తి వర్తిస్తుందన్నారు. కార్మిక శాఖ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

తైక్వాండోలో బంగారు పతకం


శైలజ, కోచ్ సురేష్‌ను అభినందిస్తున్న బాపట్ల జిల్లా రిజర్వు ఇన్‌స్పెక్టర్ మన్మథరావు

చీరాలరూరల్: జాతీయ స్థాయిలో నిర్వహించిన జూనియర్ తైక్వాండో పోటీల్లో చీరాలకు చెందిన ఎం.శైలజ బంగారు పతకం సాధించింది. ఇటీవల జనవరిలో బెంగళూరులోని కోరమంగళ ఇండోర్ స్టేడియంలో ఇండియా తైక్వాండో జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్–2023 పోటీలు నిర్వహించారు. పోటీల్లో జిల్లా తైక్వాండో కోచ్ మల్లెల సురేష్ ఆధ్వర్యంలో చీరాలకు చెందిన 63 కిలోల మహిళా విభాగంలో ఎం.శైలజ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించింది. జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన క్రీడాకారిణిని, కోచ్‌ను బాపట్ల జిల్లా రిజర్వు ఇన్‌స్పెక్టర్ ఎల్.మన్మథరావు అభినందించారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఏపీ తైక్వాండో సీఈవో కృష్ణ, ఏపీ ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరావు, జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు మంత్రి శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జ్ పి.సుబ్రహ్మణ్యం, కోచ్ గూడూరి శాంతి వరప్రసాద్‌లు అభినందనలు తెలిపారు.

వెట్టిచాకిరీ నిర్మూలన సామాజిక బాధ్యతగా గుర్తించాలి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి


వెట్టిచాకిరీ నిర్మూలన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరువెస్ట్: ఆధునిక మానవ సమాజంలో వెట్టిచాకిరీ, బానిసత్వాలకు చోటులేదని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్‌లోని చాంబర్‌లో కలెక్టర్‌తోపాటు ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్, అధికారులు అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15 వరకు వారోత్సవాలు నిర్వహించాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం పనిచేసే విధానంలో ఆధునిక పరిజ్ఞానం విస్తృత పాత్ర పోషిస్తుందన్నారు. వెట్టిచాకిరీ అంటే సాటి మనిషిని హింసించడమేనని చెప్పారు. దీనికి సంబంధించి అనేక చట్టాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎక్కడైనా వెట్టిచాకిరీని గుర్తిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని, దీనిని సామాజిక బాధ్యతగా గుర్తించాలని కలెక్టర్ కోరారు.

వేగంగా ఓటర్ల దరఖాస్తుల పరిష్కారం

కొత్త ఓటర్ల నమోదు, పేరు, చిరునామా మార్పులు ఇతర సమస్యలకు సంబంధించి జనవరి 6 నుంచి ఇప్పటి వరకు 13,098 దరఖాస్తులు అందాయని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వీటిలో ఇప్పటి వరకు 7401 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. మిగతా 5697 దరఖాస్తులను వారం రోజుల్లోనే పరిష్కరిస్తామన్నారు. ఓటరు దరఖాస్తులు సక్రమంగా పరిష్కరించేందుకు ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో నిరంతర సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఓటరుకు ఆధార్ కార్డు అనుసంధానం గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల మినహా జిల్లాలో 70 శాతం పూర్తయ్యిందన్నారు. సమావేశంలో తెనాలి డిప్యూటీ కలెక్టర్ గీతాంజలిశర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేపై సమీక్ష

గురువారం రాష్ట్ర సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి భూముల రీసర్వే ప్రక్రియపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ వీడియో సమావేశం నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, తెనాలి డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి శర్మ, అధికారులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్య, వైద్యం అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో ఇప్పటికే కొన్ని పోస్టులను భర్తీ చేశామన్నారు. గర్భిణులకు ప్రతి నెలా రక్తపరీక్షలు నిర్వహించి అనారోగ్య సమస్యలు గుర్తించడంతోపాటు రక్తహీనతకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. పాఠశాలలు మానేసిన విద్యార్థులను మళ్లీ చేర్పించేందుకు సచివాలయ సిబ్బందితోపాటు, వలంటీర్లు, అంగన్‌వాడీలు క్రమం తప్పకుండా అవగాహన కల్పిస్తున్నారన్నారు.

మైనర్ బాలిక ఆత్మహత్య

- ప్రేమించిన వ్యక్తి వంచన
- కేసు నమోదు చేసిన దుగ్గిరాల పోలీసులు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండలం గొడవర్రు గ్రామంలో ప్రేమించిన ఓ మైనర్ బాలికను మోసం చేయడంతో మనస్తాపం చెందిన ఆ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొడవర్రుకు చెందిన కణపాల అనీల్ 10వ తరగతి పూర్తి చేసి ఇంటిదగ్గరే ఉంటున్న 17 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. ఇద్దరి మధ్య కొంతకాలంగా ప్రేమ వ్యవహారం కొనసాగుతోంది. వీరిద్దరి ప్రేమ వ్యవహారం ఇరు కుటుంబాలకు తెలిసింది. వారు కూడా పెళ్లి చేయడానికి అంగీకరించారు. ఆ బాలిక వివాహం చేసుకోవాలని ఒత్తిడి తీసుకువచ్చింది. అనిల్ హైదరాబాద్ వెళ్లిపోయాడు. అతని కుటుంబ పెద్దలను అడిగినా ఎటువంటి సమాధానం లేదు. అనిల్‌కు బుధవారం ఆ బాలిక ఫోన్ చేసి పెళ్లి విషయం ప్రస్తావన తేగానే బాలికను నోటికి వచ్చినట్లు దుర్భాషలాడాడు. పెళ్లి చేసుకోను ఏం చేసుకుంటావో చేసుకో అనడంతో మనస్తాపం చెందిన బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. సంఘటనపై దుగ్గిరాల ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్‌లో ఉన్న అనీల్‌ను అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు వెళ్లినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణాధికారిగా సుధీర్‌కుమార్


సుధీర్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మనోహర్

గుంటూరుఎడ్యుకేషన్: టీజేపీఎస్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్‌ను గుంటూరు జిల్లాకు సంబంధించి ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారిగా నియమిస్తూ ఏఎన్‌యూ ఉప కులపతి ప్రొఫెసర్ పి.రాజశేఖర్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. గురువారం పట్టాభిపురంలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాతీయ సేవ అంటే దేశ సేవ అని, అటువంటి గౌరవ ప్రదమైన బాధ్యతను తమ కళాశాలకు చెందిన అధ్యాపకునికి ఇవ్వడం అభినందనీయమన్నారు. సుధీర్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక పరమైన కార్యక్రమాలు చేయడం తనకు ఎంతో ఇష్టమని, టీజేపీఎస్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ అధికారిగా చేపట్టిన కార్యక్రమాల వలనే తనను జిల్లా అధికారిగా ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎన్ఎస్ఎస్ గుంటూరు జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారిగా అదనపు అర్హత కల్పించిన ఏఎన్‌యూ వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్‌తో పాటు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రొఫెసర్ రవిశేఖర్, సహాయ సమన్వయకర్త డి.రవిశంకర్‌రెడ్డికి, కళాశాల కరస్పాండెంట్ తెల్లాకుల శ్రీనివాసబాబుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాల్లోని వివిధ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళతానని తెలిపారు.

బాలోత్సవానికి తరలిరండి

గుంటూరుఎడ్యుకేషన్ గుంటూరులోని పాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో ఈనెల 11,12 తేదీల్లో నిర్వహిస్తున్న గుంటూరు జిల్లా బాలోత్సవానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తరలిరావాలని బాలోత్సవం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలోత్సవ ప్రారంభ కార్యక్రమానికి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. బాలోత్సవం ప్రధానకార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ 23 అంశాల వారీగా 4,5,6,7 తరగతుల విద్యార్థులకు జూనియర్, 8,9,10 తరగతులకు సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు. సమావేశంలో బాలోత్సవం ప్రతినిధులు జి.వెంకట్రావు, బి.ఆదిలక్ష్మి, జీవీ శ్రీనివాస్, ఎం.భావన్నారాయణ, షేక్ పీర్ సాహెబ్ పాల్గొన్నారు.

యువ జంట ఆత్మహత్యాయత్నం

తెనాలిరూరల్: ఎలుకల మందు తిని యువ జంట ఆత్మహత్యాయత్నం చేసింది. భార్య ప్రస్తుతం ఆరు నెలల గర్భవతి. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నందులపేటకు చెందిన చెన్నంశెట్టి బాలనాగతిరుమలేష్, నవ్యశ్రీలకు ఏడాదిన్నర కిందట వివాహమైంది. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే తిరుమలేష్ వర్క్ ఫ్రం హోం కారణంగా ఇక్కడే ఉంటున్నాడు. గురువారం ఇంట్లో ఎలుకల మందు తిని భార్యాభర్తలిద్దరూ ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన కుటుంబసభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించగా, మెరుగైన వైద్యం కోసం ఆరు నెలల గర్భవతి అయిన నవ్యశ్రీని గుంటూరు సమగ్ర వైద్యశాలకు పంపారు. ఇద్దరి నుంచి పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడుపులో మంటకు కారణాలెన్నో!

- అల్సర్లతో అప్రమత్తత అవసరం
- నానాటికి పెరుగుతున్న జీర్ణకోశ వ్యాధులు



గుంటూరు మెడికల్: ఫాస్ట్ ఫుడ్స్‌కు అలవాటు పడడం, పాశ్చాత్య జీవన శైలికి అలవాటు పడడం, ఇంట్లో వంట తగ్గించేసి హోటళ్లలో సమయపాలన లేకుండా మసాలాలతో కూడిన ఆహారం అమితంగా తీసుకోవడం వల్ల అనేక రకాల వ్యాధులను ప్రజలు కొని తెచ్చుకుంటున్నారు. జీర్ణకోశ వ్యాధులపై ఏమాత్రం అవగాహన లేకపోవడం వల్ల ప్రజలు ఏళ్ల తరబడి ఎడాపెడా మందులు వాడుతూ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులను సంప్రదించకుండా సొంత వైద్యం చేసుకుంటూ చివరకు ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. ఒకింత వ్యాధులపై అవగాహన కలిగి ఉండటం ద్వారా ప్రాథమిక దశలోనే జీర్ణకోశ వ్యాధులను కట్టడి చేయడంతోపాటు, వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు.

సొంతవైద్యంతో మొదటికే మోసం..

అల్సర్ సోకగానే ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై వైద్యుల సలహాలు పాటించకుండా ఇష్టానుసారంగా మందులు వాడేస్తుంటారు. అల్సరుకు నెలల తరబడి గ్యాస్ మాత్రలు వాడవలసిన అవసరం లేదు. అల్సర్‌కు కారణం కేవలం (యాసిడ్) కాదు. హెచ్. పైలోరి బ్యాక్టీరియా లేదా నొప్పి మాత్రల వల్ల అల్సర్ సోకుతోంది. అల్సరు తగ్గడానికి ఆ బ్యాక్టీరియా కోర్సు వాడితే సరిపోతోంది. అతిగా నొప్పి మాత్రలు వాడితే జీర్ణాశయానికి పుండ్లు పడతాయి. ఆస్ప్రిన్, నొప్పి మాత్రలు వాడుతున్న వారికి పొట్టనొప్పి, మంట వచ్చినా, నల్ల విరోచనాలు, నోటిలో రక్తం వచ్చినా వెంటనే ఎండోస్కోపి చేయించుకోవాలి.

జీర్ణాశయ క్యాన్సర్‌ను గుర్తించండి

ఫ్యాషన్ కోసం అలవాటు చేసుకునే చెడు వ్యసనాలు జీర్ణ కోశ వ్యాధులకు ముఖ్యంగా జీర్ణాశయ క్యాన్సర్‌కు కారణమవుతున్నాయి. సిగరెట్, మద్యం సేవించడం వల్ల లివర్ క్యాన్సర్ సోకే ప్రమాదం ఉంది. అతిగా మద్యం తాగితే క్లోమం దెబ్బతింటుంది. తీవ్రమైన పొట్టనొప్పి, వాంతులు, నడుం నొప్పి, షుగరు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. దీనిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స చేయడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చు. సిగరెట్, మందు తాగేవారు. 50 సంవత్సరాల పైబడినవారు బరువు తగ్గుతున్నా, ఆకలిలేకున్నా, మింగటంలో ఇబ్బంది, రక్త హీనత, అతిగా వాంతులు ఉన్నా, వెంటనే గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించాలి. గుట్కా, పాన్ పరాగ్, సిగరెట్లు తాగితే నోటి, జీర్ణాశయ క్యాన్సర్ వస్తుంది. ఆహారనాళం పూర్తిగా మూసుకుపోతుంది. నోటిద్వారా ఆహారం తీసుకోలేరు. ఈలక్షణాలు ఉన్నవారు గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించాలి.

పిల్లలకు చిల్లర ఇవ్వొద్దు

పిల్లలు తినుబండారాల కొనుగోలు కోసం మారం చేసి డబ్బులు అడిగినప్పుడు ఎట్టిపరిస్థితుల్లో వారి చేతికి చిల్లర డబ్బులు ఇవ్వొద్దు. ముఖ్యంగా ఆటలు ఆడుకునే సమయంలో నోటిలో పట్టేంత చిన్న బొమ్మలు, వస్తువులు ఇవ్వవద్దు. తద్వారా పిల్లలు అమాయకత్వంతో వాటిని నోటిలో పెట్టుకుని మింగుతారు. కొన్ని సందర్భాల్లో అది గొంతులో ఇరుక్కుపోయి తీవ్ర ఇబ్బందికర పరిస్థితి తలెత్తే ప్రమా దం ఉంది. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా పిల్లలకు ఏమీ తినిపించకుండా గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదిస్తే ఎండోస్కోపి ద్వారా చిల్లర నాణేలు, కడుపులో మింగిన వస్తువులు తొలగించవచ్చు.

ఆపరేషన్‌లు కొంత మందికి మాత్రమే..

ఈమధ్య బిజీ లైఫ్‌లో పడి సక్రమంగా మంచినీరు తీసుకోకపోవడం, త్వరగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు తీసుకోకపోవడం, జీర్ణం కావడానికి సరిపడా సమయం ఇవ్వకపోవడం ద్వారా పసరు తిత్తుల్లో రాళ్ల ఏర్పడుతున్నాయి. పసరుతిత్తిలో రాళ్ల ప్రతి 100మందిలో 10మందికి ఉంటాయి. వీరిలో 75 శా తం మందికి వీటివలన ఏ ఇబ్బందీ రాదు. కేవలం పొట్టనొప్పి, కామెర్లు వచ్చినవారికి మాత్రమే ఆపరేషన్ చేయాల్సి ఉంటుంది. పసరు తిత్తి మార్గంలో రాళ్ల అడ్డుపడితే ఆపరేషన్ లేకుండా ఇ.ఆర్.సి.పి అను ఎండోస్కోపి పద్ధతిద్వారా తొలగించ వచ్చు.

తక్కువ తినండి..



జీర్ణకోశ వ్యాధులు రావడానికి మితిమీరిన ఆహారం తీసుకోవడమే కారణమవుతోంది. తిన్న ఆహారం జీర్ణం కాక శరీర బరువు పెరిగిపోయి వ్యాయామం లేకపోవడంతో లివరులో కొవ్వు చేరే ప్రమాదం ఉంది. మద్యం బాగా తాగే వారికి వచ్చే లివరు జబ్బులన్నీ వీరికి రావచ్చు. తక్కువ తిని ఎక్కువగా నడవాలి. కోతకుట్టులేకుండా ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ ద్వారా పొట్టలో ఎటువంటి గడ్డలు అయినా పరీక్షించి ముక్క పరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారణ చేయవచ్చు.

– డాక్టర్ షేక్ నాగూర్ బాషా, లివర్, జీర్ణకోశ వ్యాధుల వైద్య నిపుణులు, గుంటూరు